క్లుప్తంగా

ఘనంగా బాల అయ్యప్ప క్షేత్ర వార్షికోత్సవం



విశేష అలంకరణలో బాల అయ్యప్ప స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక దొండపాడులోని శ్రీ బాల అయ్యప్ప క్షేత్రం 14వ వార్షికోత్సవం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ బాల అయ్యప్ప స్వామికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయం వద్ద ఉన్న స్వయం భూ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీ వేంకటేశ్వర స్వామి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీ బాల అయ్యప్ప కోలాట బృందం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

బాలలు చదరంగంలో రాణించాలి



విజేతలకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదరంగ క్రీడలో భారత క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో సత్తా చాటుతున్నారని, నేటి బాలలు చదరంగ క్రీడపై మక్కువ పెంచుకుని మరింతగా రాణించాలని చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పి.భాస్కర్ రామన్ పిలుపునిచ్చారు. స్థానిక రామచంద్రరావు పేటలోని ఏలూరు పబ్లిక్ స్కూల్‌లో చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి, ఏలూరు హేలాపురి ఎలైట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా చెస్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జి.అభిషేక్ అబ్రహమ్ ప్రథమ, ఎస్.వర్షిత్ ద్వితీయ, జి. నురూప్ మోషే తృతీయ ఎస్‌కే పర్వాన్ 4వ స్థానంలో నిలిచారు. అనంతరం అతిథులు విజేతలకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో నంది దూండి కృష్ణ, ఎస్. సుధాకర్, జి.యోహన్ పాల్గొన్నారు.

అమలులో 144 సెక్షన్

భీమడోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ యూజే విల్సన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ షాపులు మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే హాజరు కావాలన్నారు. విద్యార్థులు పదో తరగతి హాల్ టిక్కెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కర్రలవంతెన ప్రాంతంలోని హలీమ్, బిర్యానీ పాయింట్



ఏలూరు ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని హలీం పాయింట్

రంజాన్ @ హలీం

- ఏలూరు నగరంలో హలీం సందడి
- నోరూరిస్తున్న మటన్ హలీం, బిర్యానీ
- హైదరాబాద్, ఒరిస్సాల నుంచి వంట మేస్త్రీలు

ఏలూరు టౌన్: పవిత్ర రంజాన్ మాసం వచ్చిందంటే చాలు నగరాలు, పట్టణాల్లో అన్ని మతాల వారు ఇష్టంగా తినే వంటకం హలీం.. ఒక్కసారి హలీం తింటే ఫిదా అవ్వాల్సిందే... రంజాన్ నెలలో హలీమ్, బిర్యానీలను ప్రత్యేకంగా తయారు చేస్తారు. ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాస దీక్షల్లో ఉంటారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసే సమయంలో పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఆనవాయితీగా వస్తుండగా హలీం ముందు వరసలో ఉంటుంది. ఇక హలీంను ముస్లింలే కాదు... అన్ని మతాల వారికి అత్యంత ప్రీతిపాత్రమైంది. ఏలూరు నగరంలో ఆయా సెంటర్లల్లో హలీం పాయింట్లను ఏర్పాటు చేసి హైదరాబాదీ బిర్యానీ, హలీమ్, ఫలుడా, స్వీట్స్ వంటివి భోజన ప్రియులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రతి ప్రాంతంలో హలీం పాయింట్లు

ఏలూరు నగరంలో ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఫుడ్ ఇంజనీర్స్, కర్రలవంతెన ప్రాంతంలో ఆర్‌జే హలీమ్, యారజాఖ్‌స్టార్, పత్తేబాద రోడ్డులో స్వీట్ మ్యాజిక్, యూఎస్ పిజ్జా వద్ద, ఎన్ఆర్‌పేటల్లోని రెస్టారెంట్ల వద్ద మటన్ హలీం పాయింట్లు ఏర్పాటు చేశారు. గతంలో మూడు, నాలుగు చోట్ల మాత్రమే హలీం పాయింట్లు ఏర్పాటు చేయగా... ఏలూరు నగరంలో ఈ సారి 12 హలీం పాయింట్లు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా ఏలూరు నగరంలో హలీమ్, బిర్యానీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రత్యేకంగా హలీం తయారీకి హైదరాబాద్, ఒరిస్సా ప్రాంతాల నుంచి చెఫ్‌లను రప్పించి మరీ రుచికరమైన హలీంను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.



ఆకర్షణీయంగా ఘుమఘుమలాడే హలీం

వండే విధానమే ప్రత్యేకం

హలీం ప్రత్యేకంగా తయారు చేసే ఖర్ఖానాలో హలీం వండుతారు. ఈ హలీంను మటన్, గోధుమలు, నెయ్యి, జీడిపప్పు, బాదం వంటి పౌష్టికాహారాన్ని వినియోగించి రుచికరంగా తయారు చేస్తారు. ఉపవాసం ఉన్నవారు త్వరగా జీర్ణం కావడం కోసం 12 గంటల పాటు దీనిని వండుతారు. హలీం పాయింట్‌లో మటన్ హలీం రూ.190 నుంచి రూ. 220 వరకు, పార్శిల్ రూ. 320, మటన్ బిర్యాని రూ. 350, నుంచి రూ.400 వరకు, స్వీట్స్, ఫలుడా రూ. 60కు విక్రయిస్తున్నారు.

హైదరాబాద్ రుచి పరిచయం చేస్తున్నా



ఏలూరు నగర ప్రజలకు హైదరాబాద్ రుచులతో హలీం, దమ్ బిర్యానీ, స్వీట్స్ పరిచయం చేస్తున్నా. హలీం ప్రియులకు రుచికరంగా తక్కువ ధరకే అందిస్తున్నాం. హలీం తయారీలో ప్రత్యేకంగా అనుభవం ఉన్న వంట మేస్త్రిలను తీసుకువచ్చి తయారు చేయిస్తున్నాం. గత ఆరేళ్ళుగా నాణ్యమైన, రుచికరమైన హలీం మా ప్రత్యేకత.

– ఎండీ రిజ్వాన్, ఆర్‌జే హలీం సెంటర్ నిర్వాహకులు

హలీం అంటే ఇష్టం



నాకు హలీం అంటే చాలా ఇష్టం. ప్రతి ఏడాది రంజాన్‌మాసంలో హలీం తింటూ ఉంటా. ప్రత్యేకంగా తయారు చేసే హలీంలో పౌష్టికాహారం ఎక్కువగా ఉండటంతో పాటు రుచికరంగా ఉంటుంది. నా స్నేహితులతో పాటు రంజాన్ సందర్భంగా వచ్చి తింటూ ఉంటాను.

పి.భాస్కర రాంబాబు, ఏలూరు వన్‌టౌన్

హలీం రుచికి సాటి లేదు



హలీంను ప్రత్యేకంగా అత్యంత శ్రద్ధతో తయారు చేస్తారు. స్వచ్ఛమైన నెయ్యి, మాంసం, డ్రై ఫ్రూట్స్ ఉపయోగించి తయారు చేస్తారు. రుచితో పాటు ఉపవాస దీక్షలు చేసే వారికి వెంటనే శక్తినిస్తుంది. ముస్లింలతో పాటు అన్ని మతాల వారు ఇష్టంగా తినే హలీంకు సాటి మరొకటి లేదు.

– ఎస్‌కే షమీమ్, ఏలూరు

బీసీల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా పని చేయాలి



జరజాపు రాఘవను అభినందిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని నాగవంశ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి బాయి వెంకట్రావు పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు నగర యువజన అధ్యక్షుడిగా ఎన్నికైన జరజాపు రాఘువనాగ వంశ సంక్షేమ సంఘ నాయకులు ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా భాయి వెంకట్రావు మాట్లాడుతూ నాగ వంశీయులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం లో సముచిత స్థానం ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు వైనాగేశ్వరరావు కన్వీనర్ నూకాలమ్మ, జిల్లా అధ్యక్షుడు లక్కోజు గోపి లకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న యువతకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు యువజన సెక్రటరీ ఈదలాడ ఉమామహేశ్వరరావు, జిల్లా కోశాధికారి భాయి వెంకటరావు,చ టౌన్ సెక్రెటరీ కొండల ప్రసాద్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ జరజాపు ఉమా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఏలూరు (టూటౌన్): స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కి సంబంధించి 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. 77 లక్షలతో నిర్మించనున్న రెండు రోడ్లకు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు బడేటి చంటి మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతలో భాగంగా వంగాయగూడెం క్యాన్సర్ హాస్పటల్ ఎదురుగా ఉన్న పోలీస్ కాలనీ రోడ్డుకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 42 లక్షలు కేటాయించి బీటీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ సురేంద్రబాబు, డీఈలు రజాక్, కొండలరావు ఏఈలు సాయి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పచ్చ నేతల ఆదేశాలతో పాలన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మండలంలోని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆదేశాలను అనుసరిస్తూ మండల స్థాయి అధికారులు పని చేస్తున్నారని పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు ఆరోపించారు. ఆదివారం ఏలూరు ఎంపీపీ పెనుమత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన ఏలూరు రూరల్ మండలం పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో చాటుపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు మాట్లాడుతూ టీడీపీ నాయకుల ఆదేశాలు అనుసరించి హౌసింగ్ డీఈ గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులను ఇల్లు కట్టుకోనీయడం లేదని ఆరోపించారు. కలకుర్రు సర్పంచ్ భలే నాగప్రసాద్ మాట్లాడుతూ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తీర్మానం లేకుండా గ్రామంలో పలువురు టీడీపీ నాయకులు సూచించిన పనులను ఉపాధి హామీ పథకం అధికారులు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను రాజీనామా చేయించి తమకు అనుకూలమైన వ్యక్తిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించుకున్నారని వివరించారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పాలకవర్గాలను నిర్వీర్యం చేస్తూ టీడీపీ నాయకులు గ్రామాల్లో ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని మాదేపల్లి సర్పంచ్ కె.ప్రభుదేవా ఆరోపించారు. మాదేపల్లి ఎంపీటీసీ మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ అడ్డం పెట్టుకొని ఉపాధి హామీ పథకం అధికారులు గురుకులపేటలో 500 మందికి పైగా ఉపాధి కూలీలకు నెల రోజులుగా పని కల్పించడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్లను అధికారులు కాంట్రాక్టర్ పూర్తి చేస్తే నేడు టీడీపీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తున్నారని కనీస సమాచారం ఇవ్వడం లేదని మొండికోడు సర్పంచ్ గోపాలకృష్ణం రాజు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ శ్రీనివాసరాజు మాట్లాడుతూ. స్థానిక సర్పంచ్ పాలకవర్గ సభ్యులు సహకారంతో పాలన సాగించాలని మండల అధికారులకు సూచించారు. గురుకులపేటలో తక్షణం ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీలత ఏపీఓను ఆదేశించారు. దీనికి ముందు ఎంపీపీతో సహా పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో పేదల నుంచి సర్‌చార్జ్ పేరుతో అదనంగా రూ. 500 నుంచి రూ, 2000 వరకు కరెంటు బిల్లులు ఎందుకు వసూలు చేస్తున్నారని ఈపీడీసీఎల్ అధికారులను ప్రశ్నించారు. వేసవిలో తాగునీరు సమస్య తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ పన్నులు వసూళ్లు గురించి వివరించగా, వ్యవసాయ అధికారి జీవన సంధ్య అపరాల కోనుగోలు గూర్చి వివరించారు, హౌసింగ్ ఏఈ పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న అదనపు రుణం వివరాలు సభ్యులకు తెలియజేశారు. కొల్లేరులో అటవీశాఖ చేపట్టిన అక్రమ చెరువుల ప్రక్షాళన గురించి డీఆర్‌ఓ సోమరాజు వెల్లడించారు.



ఈపీడీసీఎల్ అధికారుల వ్యవహారంపై సభలో వివరిస్తున్న చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు

ముగిసిన వాసుదేవ స్వామి కల్యాణ మహోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక స్వాములు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవ స్వామి దేవస్థానంలో ఈ నెల 12 నుంచి నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం నిత్య హోమాలు, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం కొట్నాలు, వసంతోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజపట ఉద్వాసన, గరుడ ప్రసాద వితరణ, చక్రస్నాన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి 8 గంటల నుంచి స్వామి వారికి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వైద్య శిబిరంలో 126 మందికి కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కంటి చూపునకు సంబంధించి ఎటువంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యులకు చూపించి మొదటి దశలోనే వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చని పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ప్రతినిధులు సూచించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యశాల బృందం ప్రతినిధులు 126 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 16 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించి హాస్పిటల్‌కు తరలించారు. ఈ సందర్భంగా 27 మందికి కళ్లజోళ్లను సబ్సిడీ ధరలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, బీ. విఠల్, చెన్నా వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బిక్కిచిక్కుడు	90
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	76
కాకర కాయలు	30-40	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	44	కీరా దోస	36
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	68
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	35	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

పది పరీక్షల్లో అప్రమత్తంగా ఉండాలి



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎల్‌ఓ కృష్ణారెడ్డి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పదో తరగతి పరీక్షల జిల్లా పరిశీలకుడు కేవీ కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆయన మండల విద్యాశాఖాధికారులు, పదవ తరగతి పరీక్షలకు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరైన వెలుతురు, గాలి అందేలా చూడాలని, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలు తరలించే సమయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఆయన స్థానిక సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల, వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లోని గదులను పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకట లక్ష్మమ్మ ఉన్నారు.

వైభవంగా అమ్మవార్ల గంప జాతర



గణాచారులకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలు జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల గంప జాతర వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మైదానం నందు గల గంగానమ్మ వారి పురాతన దేవాలయం వద్ద గంప జాతరను ఘనంగా నిర్వహించారు. పంబలి తంగిరాల చిట్టియ్య నేతృత్వంలో గణాచారుల సంబరం చేశారు. గంగానమ్మకు వేపాకులతో కలిగిన పసుపు నీళ్ల బిందెలతో జలాభిషేకం చేశారు. తొలుత గణాచారులు మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల ప్రాంగణాల వద్ద గణాచారులకు భోజనాలు ఏర్పాటు చేసి నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పెద్దలు కరణం పెద్దిరాజు, ఆల్తి శ్రీనివాస్, బొమ్ము గాంధీ, తుమ్మల ఉమామహేశ్వరరావు, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించిన దృశ్యం

భీమడోలు: సూరప్పగూడెం చర్చిలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా రక్షణ సైన్యం చర్చి ఫాదర్ కె.అబ్రహాం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. తొలుత విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సిస్టర్ ఏస్తేరు, సంఘం పెద్దలు బి.మధు, బి.ఆదినారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



గణపవరంలో పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

గణపవరం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని రెండు తెలుగురాష్ట్రాల ప్రజలు మరచిపోరని, ఆయన త్యాగం భావితరాలకు ఆదర్శప్రాయమని అఖిలభారత హేండ్‌లూమ్స్ డైరక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా గణపవరం సంత మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాపోలు సూర్యారావు, ఆదపరెడ్డి సీతయ్య, అబ్దుల్ వహాబ్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు: ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని దెందులూరు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చల్లంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గాదంశెట్టి సుబ్బరామయ్య అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా దెందులూరు బస్టాండ్ సెంటరులో పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి సుగ్గిశెట్టి మణికుమార్, కోశాధికారి ప్రగళ్లపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.